

కొత్త తరహా పనులపై దృష్టి

కోటబొమ్మాళి: మండలంలోని ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనుల్లో భాగంగా కొత్త తరహా పనులపై దృష్టిసారించాలని ఎంపిడిఒ ఎచ్చెర్ల పద్మజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకులతో, క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం చెరువు పనులనే కాకుండా కొత్త తరహాలో ఫారం ఫాన్స్, మినీ పెర్కులేషన్ టాంకులు, మినీ అమృత సరోవర్, గ్రీన్ ఇంగు ఆఫ్ ఇల్లాక్స్ వంటి కొత్త పనులపై దృష్టి సారించాలన్నారు. కొత్త తరహా పనులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత క్రమంలో పనులు నిర్వహించాలని ఆమె సూచించారు. పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉదయం 6.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసిటి టి.రాంబాబు పాల్గొన్నారు.

పింఛను పాట్లు

- సచివాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షణ
- పంపిణీపై సమాచారం లేక అవస్థలు పడ్డ లబ్ధిదారులు
- జమ కాని డబ్బులు
- కనిపించని సౌకర్యాలు
- 29 శాతమే పంపిణీ


పొందూరు మండలం రాపాక సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛనుదారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఈ నెల అన్ని రకాల పింఛన్లు కలిపి మొత్తం 3,21,662 మందికి సంబంధించి సొమ్ము విడుదల చేశారు. బుధవారం నాటికి 93,669 మందికి (29.12శాతం) అందించారు. ఇంకా 2,28,020 మందికి పింఛను డబ్బులను అందించాల్సి ఉంది. ఆమదాలవలస పురపాలక సంఘ పరిధిలో 11 సచివాలయాలు ఉండగా, వాటి పరిధిలో 4936 మంది లబ్ధిదారులు ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు మోణింగి వారి వీధి -1, మెట్టక్కివలస-2, గేటు, చింతాడ సచివాలయాలకు మాత్రమే డబ్బులు మంజూరయ్యాయి. మిగిలిన ఏడు సచివాలయాలకు డబ్బులు అకౌంట్లలో జమ కాకపోవడంతో చాలామంది లబ్ధిదారులు పింఛను కోసం సచివాలయాల వద్ద ఎదురు చూపులు చూసి నిరాశతో ఇంటికి వెనుతిరిగారు. కొంతమంది పింఛనుదారులు ఎండతో ఇంటికి వెళ్లలేక సచివాలయంలోనే సాయంత్రం వరకు వేచి ఉన్నారు. ఎండ తీవ్రత తగ్గిన తర్వాత ఇళ్లకు తిరుగు పయనమయ్యారు. లక్ష్ముడుపేట సచివాలయం పరిధిలో తిమ్మాపురం, వెంకయ్యపేట వార్డు పింఛను లబ్ధిదారులు ఉన్నారు. వారు ఈ సచివాలయానికి చేరుకోవాలంటే తిమ్మాపురం నుంచి రెండు కిలోమీటర్లు, వెంకయ్యపేట నుంచి కిలోమీటరు ప్రయాణం చేసి చేరుకోవాలి. పింఛన్ల కోసం లబ్ధిదారుల ఉదయం 10 గంటలకే సచివాలయానికి వచ్చారు. పింఛన్లు ఇవ్వడం లేదని తెలిసినా ఎండకు భయపడి సాయంత్రం వరకు సచివాలయం వద్దే వేచి చూసి నాలుగు గంటల సమయంలో ఇళ్లకు వెళ్లిపోయారు.

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు

పొందూరులో మండలం రాపాక సచివాలయంలో బుధవారం నుంచి పింఛన్లు అందిస్తామని సమాచారమివ్వడంతో ఉదయం 9 గంటల నుంచే వృద్ధులు, వికలాంగులు, వితంతువులు చేరుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా ఉక్కబోతతో అక్కడే ఉన్న చెట్లు కిందన, చిన్నపాటి నీడల్లో నిల్చొని వేచి చూశారు. భోజన సమయం అయినా అందకపోవడంతో ఇంటికి వెళ్ళి, మరలా వచ్చి సాయంత్రం వరకూ ఉన్నారు. అయినా డబ్బులు రాలేదని సచివాలయం సిబ్బంది చెప్పడంతో ఊసూరుమంటూ ఇంటిబాట పట్టారు. పొందూరు మండలంలో ఉన్న 27 సచివాలయాలు ఉండగా, ఎనిమిది సచివాలయాలకు సంబంధించి మాత్రమే డబ్బులు వచ్చాయి పింఛను కోసం ఉదయం నుంచి సచివాలయం వద్ద ఉన్నాం. కవిటిలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్యాంకుల్లో పింఛను సొమ్ము జమకాకపోవడంతో లబ్ధిదారులకు పింఛను పాట్లు తప్పలేదు. దీంతో అటు సచివాలయ సిబ్బంది, ఇటు లబ్ధిదారులకు నిరీక్షణ తప్పలేదు. మూడో తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్రతీ సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తారనే సమాచారంతో ఉదయం నుంచే సచివాలయాలకు చేరుకున్నారు. బ్యాంకులకు వెళ్లిన సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నుంచి డబ్బులు జమ కాలేదని సమాచారం చెప్పడంతో చాలామంది వెనుదిగారు. చివరకు రెండు గంటల తరువాత పింఛను డబ్బులు రావడంతో సచివాలయాల వద్ద పంపిణీ ప్రారంభమైంది.

పింఛన్ల పంపిణీలో లబ్ధిదారులకు అవస్థలు తప్పలేదు. ఎన్నికల నేపథ్యంలో సచివాలయాల్లో పంపిణీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు బుధవారం నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు. ఫించన్ల పంపిణీకి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులు పడ్డారు. పింఛన్ల సొమ్ము కోసం బ్యాంకులకు వెళ్లిన సచివాలయ సిబ్బంది ఆలస్యంగా రావడంతో గంటల తరబడి నిరీక్షించారు. పింఛన్ల పంపిణీ ప్రాంతాల్లో టెంట్లు, నీటి వసతి సౌకర్యాలు లేకపోవడంతో చాలా అసౌకర్యానికి గురయ్యారు.

అరకొరగానే పింఛన్ల పంపిణీ

పలాసలో ఉదయం 9 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పి వాయిదా వేశారు. నగదు కోసం బ్యాంకులకు వెళ్లిన సచివాలయ సిబ్బంది తిరిగి రావడంలో జాప్యం జరగడంతో మున్సిపాలిటీ పరిధిలో మధ్యాహ్నం 12 గంటలకు, గ్రామీణ ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు పంపిణీ ప్రారంభించారు. పింఛన్లు పంపిణీ చేసే ప్రాంతాల్లో పలుచోట్ల టెంట్లు, సచివాలయాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం నుంచి పింఛన్ల సొమ్ము బ్యాంకుల్లో జమకాకపోవడం బుధవారం అరకొరగానే పంపిణీ చేశారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో కొంత సొమ్ము జమకావడంతో మున్సిపాలిటీలోని కొన్ని ప్రాంతాల్లో డబ్బులు అందించారు. పింఛన్ల అందజేతపై లబ్ధిదారులకు సమాచారం ఇవ్వకపోవడంతో బుధవారం సచివాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడ్డారు. బ్యాంకులకు వెళ్లిన సచివాలయ సిబ్బంది ప్రభుత్వం నుంచి డబ్బులు జమ కాలేదని సమాచారం చెప్పడంతో చాలా మంది వెనుదిగారు. గురువారం నుంచి పింఛన్ల పంపిణీని వేగవంతం చేస్తామని మున్సిపల్ కమిషనర్ రమేష్ చెప్పారు.


మాట్లాడుతున్న కృపారాణి

వైసిపిలో అవమానం

కేంద్ర మాజీ మంత్రి కృపారాణి రాజీనామా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గత కొంతకాలంగా వైసిపిలో ప్రాధాన్యత లేకపోవడంతో మనస్తాపానికి గురై రాజీనామా చేశానని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి కన్నీటి పర్యంతమయ్యారు. రాజీనామా లేఖను ఆ పార్టీ అధినేత, సిఎం జగన్‌కు పంపారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో ఆమె తన భర్త కిల్లి రామ్మోహనరావుతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. జగన్ ఆలోచనలు, ఆశయాలు నచ్చి 2019 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరానని అన్నారు. అయితే పార్టీలో ఆశించినస్థాయిలో తనకు ఆదరణ లభించలేదన్నారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవి నుంచీ అర్థాంతరంగా తప్పించారని, దీనిపై తనకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. జిల్లాలోని కొందరు నాయకుల వల్లే వైసిపి పెద్దలు తనను వ్యూహాత్మకంగా పక్కన పెట్టారని అన్నారు. ఉత్తరాంధ్రాలో పదవులు కట్టబెట్టిన వారితో పోల్చుకుంటే తనకు సరైన గుర్తింపు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల వేళ సైతం ఎక్కడా పోటీ చేసే అవకాశం కల్పించకుండా ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టారని వాపోయారు. ఎంపీ అభ్యర్థిగా టిక్కెట్ ఇస్తామని విజయసాయిరెడ్డి చెప్పారని, కానీ, అభ్యర్థుల జాబితాలో తన పేరు లేదని అన్నారు. ఐదున్నరేళ్లుగా పార్టీలో కార్యకర్తగా పనిచేశానని, కొన్ని నెలలుగా పార్టీలో తన స్థానమేమిటో తెల్చుకోలేక పోయానని అన్నారు.

ఈ విషయంపై సిఎంను కలవడానికి ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని, తానేంటో నిరూపించుకుంటానని అన్నారు. ఏ పార్టీలో చేరేది తర్వాత వెల్లడిస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నానని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అన్ని పార్టీల నుంచీ ఆహ్వానం ఉందని, కార్యకర్తలతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఆమెతో పాటు పలువురు టెక్కలి ప్రాంత నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

సందేహాలు నివృత్తి చేసుకోవాలి

- పొరపాట్లు ఉత్పన్నం కాకూడదు
- జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల నిర్వహణలో ఆర్ఒలు, ఎఆర్ఒలు, సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోని, ఎటువంటి పొరపాట్లు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. నగరంలోని బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆర్ఒలు, ఎఆర్ఒలు, సెక్టోరియల్ అధికారులకు శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జెజి ఎం.నవీన్ సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నికలు విధులు నిర్వహించిన అనుభవం ఉన్నవారే అన్నారు. అయితే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం మనకి తెలిసిన అంశాలను మరొక్కసారి నెమరు వేసుకోవడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి తీసుకోవడం, హోమ్ ఓటింగ్, ఇవిఎంల పనితీరు తదితర అంశాలపై శిక్షణా తరగతులు ఇస్తున్నామని అన్నారు. మనం చేసే పనిపై నమ్మకం కలిగినరోజు మనం శత శాతం విజయం సాధించగలమన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేసిన కొత్త నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని చెప్పారు. శిక్షణ పొందిన రోజు నుంచి పోలింగ్ పూర్తయ్యేవరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్ఒలు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లపై ముందస్తు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇవిఎం నోడల్ అధికారి, జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఇవిఎం, వివిపేట్ పనితీరు చేపట్టాల్సిన విధులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అలాగే బ్యాలెట్ యూనిట్, ఇవిఎం, వివిపేట్ పనితీరు పేపర్ లోడింగ్, బ్యాటరీ ఇన్సట్ తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. శిక్షణా తరగతుల్లో డ్వామా పీడీ చిట్టిరాజు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. శిక్షణా కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, శ్రీకాకుళం, పలాస ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్‌కుమార్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనీస్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, బాలాజీనాయక్, కె.శేషగిరి, ఎన్నికల డిటిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఎలాంటి ప్రచారానికైనా అనుమతి తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేపట్టబోయే ఎలాంటి ప్రచారానికైనా సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ హాలులో 40వ వారపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌సభ వరకూ జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించి అక్కడి ఆర్ఒలు అనుమతులు ఇస్తారని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రచార అనుమతులకు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా అనుమతులు ఇస్తామని అన్నారు. వివరాలన్నీ సక్రమంగా ఉంటే 24 గంటల్లో కూడా అనుమతులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. సువిధ యాప్‌లో, ప్రత్యక్షంగా పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కలెక్టరేట్‌లోని కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో విభాగంలో, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అన్నిరకాల అంశాలకు ఒకేసారి దరఖాస్తు చేసుకొంటే అనుమతుల జారీ ప్రక్రియ సులువవుతుందని చెప్పారు. ఇప్పటివరకు 150కి పైగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేశామన్నారు.

14లోగా ఓటు నమోదుకు చివరి అవకాశం

2024, ఏప్రిల్ 14వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6 సమర్పించవచ్చని సూచించారు. 2024, ఏప్రిల్ 2 ముందు తేదీ నాటికి వచ్చిన అన్ని రకాల దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టామని చెప్పారు. అన్ని రకాల చేర్పులు, మార్పులు చేశాక జిల్లాలో ఓటర్ల సంఖ్య 18,66,030గా నమోదైందని వివరించారు. ఇప్పటి వరకు 2,55,633 మందికి కొత్త ఎపిక్ కార్డులు పోస్టల్ ద్వారా అందజేశామని చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు బృందాలు పనిచేస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ రకాల ఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని చెప్పారు. సి-విజిల్ బృందాలు ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోనే 95 శాతం ఫిర్యాదులు పరిష్కరించారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. తద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తామన్నారు. సామాజిక ఫించన్లను ఈ నెల 6లోగా పంపిణీ చేస్తామని, పంపిణీ కోసం ఎక్కడా వాలంటీర్లను వినియోగించడం లేదని, సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రట్టి ప్రకాశరావు (సిపిఎం), రౌతు శంకరరావు (వైసిపి), కె.వి.రామరాజు (టిడిపి), బోకర నారాయణరావు (బిఎస్‌పి), దేశళ్ల గోవింద మల్లిబాబు (కాంగ్రెస్) పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

సిఐ దివాకర్ యాదవ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ సహకరించాలని సిఐ వాయునందన్ దివాకర్ యాదవ్ కోరారు. మండలంలోని సమస్యాత్మక గ్రామం బొబ్బిలిపేటలో ప్రశాంత ఎన్నికల నిర్వహణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలు పడి తమ విలువైన కాలాన్ని, భవిష్యత్‌ను వృథా చేసుకోవద్దని సూచించారు. గ్రామస్తులకు సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల్లో నిర్భయంగా ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను చేయొద్దని, ఒకవేళ ఎవరైనా ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమశంకర్, ఎస్ఐ ప్రవల్లిక

లైంగిక వేధింపులు నేరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లైంగిక వేధింపులు చట్టరీత్య నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని వన్ టౌన్ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లిక హెచ్చరించారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు కూన అనిల్ కుమార్ ఆధ్వర్యాన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే లైంగిక వేధింపులపై అవగాహన ఉండాలన్నారు. వాటిని ఎదుర్కొంటే, వెంటనే తల్లితండ్రులకు, కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. చాలామంది విద్యార్థులు సిగ్గుపడి, సరైన అవగాహన లేక, ఎవరితోనూ చెప్పుకోలేక సమస్యలను పెద్దవి చేసుకొని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అభిప్రాయపడ్డారు. పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి 2013లో ఓ చట్టాన్ని రూపొందించారని అన్నారు. పోక్సో చట్టం కింద మహిళలు ఎలాంటి లైంగిక వేధింపులనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జెసిఐ వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమ శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ మజ్జి శ్రీనివాసరావు, సెక్రటరి జె.హరీష్, డాక్టర్ టి.మణికంఠ, ఆర్.శ్రీనివాస్, ఉర్లాం శివతేజ పాల్గొన్నారు.

వాలంటీరు రాజీనామా

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ పరిధిలో దుర్గంపేటకు చెందిన గ్రామ వాలంటీరు నెయ్యిల సురేష్‌కుమార్ బుధవారం రాజీనామా చేసి సంబంధిత కాపీని సచివాలయ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో గ్రామ వాలంటీరుగా పనిచేశానని అన్నారు. టిడిపి నాయకుడు ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషనర్ వాలంటీరులు ఎవ్వరూ విధుల్లో పాల్గొనరాదని ఆదేశాలు జారీ చేశారని అన్నారు. అలాటప్పుడు వాలంటరీ పదవి నాకెందుకని రాజీనామా చేశానని చెప్పారు. వాలంటీరు అనేది జీతం తీసుకొని పనిచేసే ఉద్యోగం కాదని, ప్రజలకు సేవచేయడమని, ప్రజలకు సేవలు చేయనప్పుడు వాలంటరీ పదవులు ఎందుకని పేర్కొన్నారు.

అచ్చెన్న వల్లే సమస్య జఠిలం

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీకి నష్టం చేకూర్చేలా తన కుటుంబం ఏనాడూ నడుచుకోలేదని, చంద్రబాబు గౌరవంగా పిలిచి మాట్లాడడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. అరవసల్లి తన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి నియోజకవర్గంలో రెండేళ్లుగా జరిగిన పరిణామాలను వివరించామని అన్నారు. సమస్య జటిలం కావడానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పట్టించుకోకపోవడమే కారణమన్నది చంద్రబాబుకు చెప్పానని అన్నారు. నలభై ఏళ్లుగా పార్టీలో క్రమశిక్షణతోనే మెలిగామని, చంద్రబాబు ముందు అదే క్రమశిక్షణతో మాట్లాడామని అన్నారు. వేచి చూడాలన్న భావన ఆయన వ్యక్తం చేశారని చెప్పుకొచ్చారు. ఉద్దేశపూర్వకంగా కొందరు మా కుటుంబంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబును కలిసేందుకు క్రియాశీలకంగా వ్యవహరించిన నియోజకవర్గ ముఖ్య నాయకులు ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, చింతు సుధాకర్, మాదారపు వెంకటేష్, ప్రధాన విజయరాంలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు దుంగ శ్రీధర్, బలగ చెంగళరావు, ఇప్పిలి శివ, మైలపల్లి నర్సింగరావు, అమ్మోజీరావు, సాధు శ్రీను, సాధు కామేష్, బొట్ట కామరాజు, ముద్దాడ అసిరినాయుడు, బుక్క యుగంధర్ పాల్గొన్నారు.

మెడికల్ బయోటెక్నాలజీ పిజి కోర్సు మంజూరు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు వచ్చే ఏడాది నుంచి ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సును డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ మంజూరు చేసినట్లుగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశాల మేరకు బిఆర్ఎయు విసి డాక్టర్ రేమి రజని ఆమోదం తెలిపారని అన్నారు. పీజీ సెట్-2024-25 పరీక్షలో అర్హత సాధించిన వారికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ఉంటాయన్నారు.



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఆత్మ పీడీ రామచంద్రరావు

ఆధునికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులు ఆధునికతను అందిపుచ్చుకోవాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రామచంద్రరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు యాంత్రీకరణపై శిక్షణా కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణతో అవకాశాలను అందిపుచ్చుకొని అధిక దిగుబడులను సాధించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన రైతులకు ధ్రువపత్రాలను అందించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు కెవికెలో శిక్షణ పొందిన రైతులు వరినాట్లు వేసే యంత్రాలను నడపడం నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు బి.వి.రమణమూర్తి, వరాహ నరసింహం పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ సంఘ మహిళలు

స్వేచ్ఛగా ఓటు వేద్దాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వచ్ఛమైన పరిపాలన కోసం స్వేచ్ఛగా ప్రతిఒక్కరూ ఓటు వేయాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అక్కులపేట, తోటాడ, అక్కివరంలో గ్రామ సంఘాల మహిళలతో ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో 18 ఏళ్లు పైబడిన వయోజనులంతా స్వేచ్ఛగా ఓటు వేయాలని, అర్హులంతా ఓటుహక్కు కలిగి ఉండాలని, ఓటుహక్కు ఉన్న వారంతా తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మితో పాటు గ్రామ సంఘం ప్రతినిధులు, విఒఎలు, స్వయంశక్తి సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

తూర్పుకాపుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తూర్పుకాపు సంక్షేమానికి కృషి చేశామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో తూర్పు కాపు నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సంక్షేమ భవనానికి 50 సెంట్లు స్థలాన్ని కేటాయించిన మంత్రిని తూర్పు కాపు నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మాన మాట్లాడుతూ తను రాజకీయ ప్రయాణంలో తూర్పుకాపుల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, కొండాల గణేష్, గేదెల వాసుదేవరావు, ఇజ్జాడ శివన్నారాయణ, కద్దాల శ్యామ్, శానపు జోగినాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విలీన పంచాయతీల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా నాయకులు టి.తిరుపతిరావు, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజులు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 నుంచి విలీన పంచాయతీ కార్మికులను కార్పొరేషన్‌లో విలీనం చేశారని, అప్పటి నుంచి నేటి వరకు సమస్యలను పట్టించుకునే వారు లేరని వాపోయారు. రెగ్యులర్ కార్మికులకు ఇవ్వాల్సిన సరెండర్ సెలవులు, ఇంక్రిమెంట్లు, 30 ఏళ్ల అనుభవం ఉన్న కార్మికులకు స్పెషల్ ఇంక్రిమెంట్లు అమలు చేయాలని కోరారు. నగర పారిశుధ్య అవసరాలకు అనుగుణంగా సరిపడా కార్మికులను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.గురుమూర్తి, ఎన్.బాబూరావు, ఎన్.పార్థసారధి, ఆర్.గణేష్, ఎ.పెద్దమని, పి.గోపి, బి.కూర్మారావు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న జడ్జి ప్రసన్నలత

జడ్జి నివాస భవన నిర్మాణానికి శంకుస్థాపన

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కోర్టు ఆవరణలో న్యాయమూర్తి నివాస భవన నిర్మాణానికి జూనియర్ సినియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు, భవన నిర్మాణ శాఖ ద్వారా ఈ నివాస భవనం నిర్మిస్తున్నామని అన్నారు. ఒక రూ.కోటి అంచనాలతో రాష్ట్ర హైకోర్టు అనుమతిని మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, ఆర్అండ్‌బి డిఇ తిరుపతిరావు, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస కోర్టుల సూపరింటెండెంట్లు వెంకటరావు, నాగభూషణరావు, జగన్నాథపాణిగ్రాహి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ అడ్డుకున్నది చంద్రబాబే

ఆమదాలవలస: పింఛన్ల పంపిణీని అడ్డుకున్న పాపం చంద్రబాబుదేనని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం బొడ్డేపల్లిపేట వద్ద జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంతో నిబద్ధతతో అవ్వా తాతల చేతికి పింఛన్ అందించిన జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు నిలిపేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటేస్తే ఇటువంటి ఇబ్బందులే ఎదురవుతాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబు కుట్రలతో పింఛనుదారుల నోటి దగ్గర కూడు లాగేసినట్టైందని, ఈ పాపం ముమ్మాటికీ చంద్రబాబుదేనని రవికుమార్ స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సంక్షేమ అభివృద్ధికి మద్దతు పలికి మళ్లీ జగన్మోహన్ రెడ్డిని సిఎం చేయాలని కోరారు.

జగన్‌తోనే సంక్షేమం


పాతపట్నం : ప్రచారం చేస్తున్న శాంతి


ఇచ్ఛాపురం : ప్రచారం చేస్తున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అల్లెనలో ఆమదాలవలస వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందజేశారన్నారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే జగన్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ఆయనకు హారతులు పట్టారు. సర్పంచ్ జడ్డు దివ్య, మహేష్. జడ్డు రమానంద్, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, మాజీ ఎఎంసి చైర్మన్ గుమ్మడి రాంబాబు, ఎస్‌టి సెల్ అధ్యక్షులు సురేష్ దొర, పిఎసిఎస్ డైరెక్టర్ గోవిందరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక మేజర్ పంచాయతీలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గుడ్ మార్నింగ్ పాతపట్నం కార్యక్రమం నిర్వహించారు. విద్యానగర్, విద్యానగర్ కాలనీ, యశోధనగర్, సంపంగి నగర్ తదితర వీధుల్లో పర్యటించి అభివృద్ధి సంక్షేమం వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రదీప్. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మారడికోటలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దింటి భాగ్యం, శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయకుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ ఎ.రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో 15వ వార్డులో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయకు మద్దతుగా చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్ పిలక ఈశ్వరి, ప్రకాశరావు పట్నాయక్, సాలిన ఢిల్లీ, గుజ్జు తారకేశ్, సంతోష్, విజయ, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అలాగే మండలంలోని హరిపురం, బొడ్డకల్లి గ్రామాల్లో ఎంపిపి బోర పుష్ప, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, ఆసి పురుషోత్తంరెడ్డి, పి.రాజశేఖర్‌రెడ్డి, ఆసి కృష్ణారెడ్డి,


బూర్జ : ఇంటింటా ప్రచారం చేస్తున్న సీతారాం


టెక్కలి రూరల్ : ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాస్

బతకల మోహన్‌దాస్, కె.మోహనరావు, ఇంద్రసేనారెడ్డి, నూకయ్యరెడ్డిలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయకు మద్దతుగా ప్రచారం చేపట్టారు.

కొత్తూరు: ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి శాంతికి మద్దతుగా వైసిపి నాయకులు ఓంశ్రీకృష్ణ, నాయకులు సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, నాసా బాల కృష్ణ, జి.ఆనందరావు, తిరుపతిరావు, నాగేశ్వరరావు, కె.రమణ ప్రచారం చేశారు.

టెక్కలి రూరల్ : టెక్కలి పంచాయతీలో వంశధార కాలనీ, కొత్తమ్మతల్లివీధి, శ్రీనివాస నగర్, ఎన్‌టిఆర్‌కాలనీల్లో ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండేల సుజాత, ఎంపిటిసి కూన పార్వతి, పీత హేమలత, అనంతయ్య, మహిళా జిల్లా అధ్యక్షులు చింతాడ మంజు పాల్గొన్నారు.


ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజల నడ్డి విరిచిన వైసిపి

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి విజయానికి మహిళలు కృషి చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయ ఆవరణలో టిడిపి మహాశక్తి మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మద్యం, ఇసుక, భూ దోపిడీలతో అక్రమార్జన ద్వారా రూ.6 లక్షల కోట్లు ప్రజల సొమ్మును జగనాసురుడు స్వాహా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్, ఆర్‌టిసి, పెట్రోల్, గ్యాస్ ధరల పెంపుదలతో పాటు ఇంటి పన్నులు, చెత్త పన్నులు ప్రతి ఏడాది 15శాతం పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్న విషయాన్ని మహిళలు అవగాహనతో ఆలోచించి ఇటువంటి ఆర్థిక ఉగ్రవాదిని ఎన్నికల్లో ఓడించాలన్నారు. మహళలు తోటి మహిళలకు టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు తమ్మినేని గీత, బోయిన సునీత, కణితి విజయలక్ష్మి భాయ్, కూన వెంకట రాజ్యలక్ష్మి, కూటమి నాయకులు పేడాడ సూరపునాయుడు, పేడాడ రామ్మోహన్, నూకరాజు పాల్గొన్నారు.

పొందూరు: పట్టణంలో యర్రావారి కళ్యానమండపంలో బుధవారం టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి మహిళలు అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలపై చర్చించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్, టిడిపి మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, ఎంపిటిసిలు బాడాన హారిక, అనకాపల్లి వాణి, టిడిపి నాయకులు అన్నెపు


పొందూరు : టిడిపిలో చేరిన వారితో రవికుమార్

రాము, బలగ శంకరభాస్కరరావు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

పొందూరు మండల కేంద్రంలో వైసిపికి చెందిన 20 కుటుంబాలు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. పట్టణానికి చెందిన అనకాపల్లి సత్యం, వెంకటరావు, సంచెయ్య, చెల్లూరి పైడినాయుడులతో పాటు పలు కుటుంబాలకు చెందిన వారికి రవికుమార్ టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

'సూపర్ సిక్స్'పై అవగాహన

ప్రజాశక్తి- పాతపట్నం

ఒక్క అవకాశాన్ని కల్పించండి అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు ప్రజలను అభ్యర్థించారు హిరమండలం మండల కేంద్రంలో ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సలాన శరత్ కుమార్, దుక్క శ్రీకాంత్ రెడ్డి, అమర చిరంజీవి, హిరమండలం టిడిపి అధ్యక్షులు యాళ్ల నాగేశ్వరరావు, పోతురాజు శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కంపోస్టు కాలనీలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నక్క శంకరరావు, వి.శ్రీనివాసరావు, రవీంద్రకుమార్, దేశల్ల రామారావు, కరకవలస శరత్‌బాబు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సామాజిక పింఛను ప్రతినెలా 1న వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఉదయానే ఇచ్చావారని, అలా ఇవ్వకుండా పింఛనుదారులను సచివాలయాలకు వెళ్లి అక్కడ గంటల తరబడి లైన్‌లో నిలుచోని పింఛను తీసుకుంటున్నారని, దీనికి కారణం చంద్రబాబేనని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు


పాతపట్నం : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న గోవిందరావు

నూక సత్యరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళిలు ఆరోపించారు. మండలంలోని చిట్టేవలస, వింజాంపాడు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, వైస్ ఎంపిపి దుక్క రోజా, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు బాగా పెరిగి ఎండలు తీవ్రత అధికంగా ఉన్నందున గ్రామీణ ప్రాంతంలో పొలం పనులు, ఉపాధి హామీ పనులు చేస్తున్న రైతు కూలీలకు వడ దెబ్బకు సంబంధించిన అవగాహన కల్పించాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మునగవలస పంచాయతీలో మహిళా సంఘాలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైతే తప్ప 11 గంటలు దాటిన తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకు బయట ప్రయాణాలు, పనులు వాయిదా వేసుకోవాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే వెంట తాగునీటిని తీసుకువెళ్లాలని సూచించారు. రైతులు, గొర్రెలు, పశువుల కాపర్లు మిట్ట మధ్యాహ్నం సమీపంలో ఉన్న చెట్లు కిందకు చేరుకోవాలని తెలిపారు. ఎండల తీవ్రత వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందున రోడ్డు పక్కన గల బస్ స్టాపుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసుకొని మట్టి కుండలో నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా 50 ఏళ్లు పైబడిన మహిళలు, ఉపాధిహామీ కూలీలు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, గ్లూకోజ్ వాడడంతో పాటు వైద్యుల సలహాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు ఉషారాణితో పాటు విఒఎ రమణమ్మ, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒక్క ఛాన్స్ ఇవ్వండి, అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని చింతలపేట, దండేవలస, బొబ్బిలిపేటలో మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, మాజీ జిల్లా గ్రంధాలయ చైర్ పర్సన్ సువ్వారి సువర్ణతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్ద కాలంగా బావ బావమరిది పోటీ చేస్తూ ఇరువురిలో ఒకరు గెలుపొందుతూ ప్రజల సమస్యలను గాలికొదిలేసి వారిరువురు అభివృద్ధి చెందారన్నారు. గ్రామాల్లో నేటికీ సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని, అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు. కార్యక్రమంలో పేడాడ ధనుంజయ్, కంచు శ్రీను, అల్లు శ్రీను, రామస్వామి, పేడాడ అప్పన్న, పేడాడ భాస్కర్, పేడాడ రాము పాల్గొన్నారు.

బూర్జ: మండలం కొరగాం పంచాయతీలో స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీని గెలిపించాలని సువ్వారి సత్యనారాయణ (ఢిల్లీ) ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సుదీర్, గోవింద, సూర్యారావు, రాము, ఆదినారాయణ, రవి, మోహన్ చౌదరి, గోపాల్ పాల్గొన్నారు.


ఆమదాలవలస : పోస్టర్లను పంపిణీ చేస్తున్న గాంధీ, దివ్య

చలివేంద్రాలు ప్రారంభం


కవిటి : చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరామ్‌ప్రసాద్

ఇచ్ఛాపురం : వేసవి కాలం దృష్ట్యా పురపాలక సంఘం, డైలీ మార్కెట్ ఆవరణలో చలివేంద్ర కేంద్రాలను కమిషనర్ నల్లి రమేష్ బుధవారం ప్రారంభించారు. రద్దీగా ఉండే ఈ రెండు ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎఇ కామేశ్వరరావు, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, అమినీటిస్ సెక్రటరీ పృధ్వీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని బొరివంకలో యువత ఆధ్వర్యాన బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఎంపిటిసి ఆర్థిక సహాయంతో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం శ్రీరామ్‌ప్రసాద్, మాజీ సర్పంచ్ అంతర్యామి, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్ కృష్ణ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : ప్రారంభిస్తున్న కమిషనర్ రమేష్


శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు

అధ్వాన రోడ్డుతో అవస్థలు

టెక్కలి: మండలంలో నౌపడ రైల్వేగేటు వద్ద ఉన్న రోడ్డు పుర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. పూండీ మార్గంలో ప్రధాన రహదారి కావడం, ఈ రోడ్డు మీదుగా నౌపడ రైల్వే జంక్షన్‌కి వెళ్లే మార్గం కావడం, ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న మూలపేట పోర్టు నిర్మానానికి ఆవసరమైన ప్రధాన మార్గం కూడా ఈ రోడ్డే కావడంతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డు సుమారు ఏడాది కాలంగా మరమ్మతులకు గురైనప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో ఈ రోడ్డు ప్రయాణం చేసే వాహనదారులు ప్రమాదానికి గురికావడమే కాకుండా వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే శాఖ పరిధిలో ఈ మార్గం ఉండడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వేశాఖాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ రవికుమార్

వివాదాల జోలికి పోవద్దు

ప్రజాశక్తి- పొందూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరు ఎటువంటి వివాదాల జోలికి పోవద్దని ఎస్ఐ వై.రవికుమార్ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన మజ్జిలిపేటలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేచ్ఛపూరిత వాతావరణంలో ఎన్నికలను జరుపుకోవాలని, యువత వివాదాల జోలికిపోయి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. ఈయనతో పాటు ఎఎస్ఐ రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కోళ్ల వ్యర్థాలతో ఇక్కట్లు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి నుంచి లఖందిడ్డికి వెళ్లే మార్గంలో బంజీరుపేట గ్రామ సమీపంలో రోడ్డు పక్కన కోళ్లఫారం నుంచి వచ్చిన వ్యర్థాలను వేయటంతో ఆ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులు దుర్గంధపు వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. సుమారు అర కిలోమీటరు వరకు ఈ దుర్గంధం రావటంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల ఫారం యాజమాన్యానికి, పంచాయతీ కార్యదర్శులకు ఈ విషయం చెప్పినా పట్టించుకోవటం లేదని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు దూరంగా ఈ వ్యర్థాలను వేసేలా కోళ్లఫారం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన వేసిన కోళ్లఫారం వ్యర్థాలు


పరిశీలిస్తున్న క్యూస్ టీమ్

ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గోవిందపురం శివాలయం, అయ్యప్పస్వామి ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి వెండి వస్తువులు చోరీకి గుయ్యాయి. ఆలయ ధర్మకర్త కొంచాడ ధర్మారావు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం ఆలయానికి తాళం వేసి వెళ్లిన పూజారి బుధవారం ఉదయం తెరిచి చూసేసరికి ఆయలంలోని వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్తులతో కలిసి పోలీసులకు సమాచారం అందజేశారు. స్థానిక పోలీసులు, శ్రీకాకుళం భరత్ ఆధ్వర్యాన క్లూస్‌టీమ్ వచ్చి పరిశీలించారు. ఆలయాల వెనుక భాగంలోని ప్రహరీ పైనుంచి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారని అనుమానిస్తున్నారు. దొంగలు లోపలికి ప్రవేశించగానే సిసి టివి పుటేజ్‌కు సంబంధించిన డివిఆర్‌ను కత్తిరించి తమతో పాటు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆధారాలను, ఫింగర్ ప్రింట్స్ నమూనాలు సేకరించే ప్రయత్నం చేశారు. కానీ, ఎటువంటి ఆధారాలు దొరకలేదు. రెండు ఆలయాల్లో ఆరున్నర వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పూజారులు తెలిపారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ రూరల్ సిఐ ఈశ్వరరావు సందర్శించి పరిశీలించారు. ఎస్ఐ సిహెచ్.రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అవగాహన కల్పిస్తున్న సర్వేశ్వరరావు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు బుధవారం అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ద్రవ పదార్థాలు, ఫోం వాడాలన్నారు. అగ్ని ప్రమాదాలను ప్రాథమిక దశలోనే నివారించే డ్రై కెమికల్ పౌడర్ ఉపయోగించే విధానాలను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిహెచ్ లక్ష్మీనారాయణ, వెంకట రమణ, కె.నరసింహ మూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో 'స్పెల్ బి' పోటీలు

ప్రజాశక్తి- పాతపట్నం

మండల కేంద్రంలో ఉన్న ఎపి ఆదర్శ పాఠశాలలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్ బి పోటీలు నిర్వహించారు. ఆదర్శ పాఠశాల సిబిఎస్ఇకి మారిన నేపథ్యంలో విద్యార్థుల్లో ఆంగ్ల నైపుణ్యాలు మెరుగు పర్చేందుకు పాఠశాల ప్రిన్సిపాల్ కెవి రత్నకుమారి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం లాంగ్ లిట్ ప్రయోగశాలలో సెల్ప్ బి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విలియమ్ షేక్స్పియర్ గ్రూప్ ప్రథమస్థానం, సరోజిని నాయుడు గ్రూప్ ద్వితీయస్థానం కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఉపాధ్యాయులు మంత్రి వెంకటరాజు, టి.లలిత కుమారి, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రణస్థలం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల నియోజక వర్గం స్వతంత్ర అభ్యర్థిగా రణస్థలం మండలం పైడిపేటకు చెందిన పైడి శ్రీనివాసరావు (వైసిపి రెబల్ అభ్యర్థి)గా పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని కొష్టలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి పలు పదవులు చేశానని అయితే ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడి ఉందని, ఎమ్మెల్యేగా 2024 ఎన్నికల్లో విజయం సాధించి తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా సాగునీరు శివారు ప్రాంతాల వరకు తీసుకురావడంతో పాటు ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అచ్చెన్నకు పరామర్శ

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్ర మోహన్, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు రామ్మోహనరావు, బి.ప్రవీన్, కణితి కిరణ్‌కుమార్, పల్లి కోటేశ్వరరావు, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మెట్ట తిరుమలరావులు నిమ్మాడలోని అచ్చెన్నను బుధవారం పరామర్శించారు. ముందుగా కళావతమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు.

రోగులకు రొట్టెల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: సినీ నటుడు అల్లు అర్జున్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా అభిమానులు


రొట్టెలను పంపిణీ చేస్తున్న అభిమానులు

జిల్లాలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బుధవారం రొట్టెలను పంపిణీ చేశారు. చిరంజీవి అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షులు తైక్వాండో శ్రీను మాట్లాడుతూ మెగా కుటుంబం నుంచి వచ్చిన సినీ నటులు అభిమానులు సేవా కార్యక్రమాలు ముందుండాలని పిలుపునిచ్చారు. పుక్కళ్ల నవీన్, భాను బన్ని, మోహనరావు, రమణారెడ్డి, కెల్ల గిరి, భాస్కర్, వంశి పాల్గొన్నారు.